# నల్లపిల్లి!!

* ఆకెళ్ళ *
సూర్యనారాయణ

★

"స్వర్ణంతో ఓపిల్లిని చేయించి దానమిస్తే పిల్లిని చంపిన పాపం పోతుంది. అది తాహతును బట్టి వుంది. ఎంతతక్కువైనా నాలుగు తులాలకు తక్కువ ఉండకూడదు. కనుబొమలెగరేసుకుంటూ కుర్చీలో కూర్చున్న పురోహితుడు రామశాస్త్రి అన్నాడు—తనకెదురుగా తివాచీమీద కూర్చున్న రంగనాయకమ్మతో.

"అబ్బా! నాలుగు వందలన్నమాట. ఇంకేదైనా మార్గం లేదా?" తనమీద పడ్డ పెద్ద భారంతో తిరిగి అంది రంగనాయకమ్మ.

"లేకపోతే ఏదైనా దేవాలయప్రతిష్ఠయినా చేయించాలి. అంతేగాని మాటలతో పోయేదా యీ పాపం. పాపమంటే పాపమా? నల పిల్లిని చంపిన పాపం," ధీమాగా అన్నాడు పురోహితుడు.

"నేను దానిజోలికి వెళ్ళలేకే ఊరుకున్నానండీ యీ నాలుగురోజులనుంచీ! పాలేకదా! పోతే పీడాపాయిరి. అనుకున్నా, నాకు తెలుసును ఏమాత్రం చెయ్యితప్పినా యీబెడద వచ్చిపడుతుందని. అది చిన్నపిల్ల తగిలేదీ తప్పేదీ తెలియదాయె. అయినా మా ఖర్మంగాకపోతే, యిట్టే వేసినదెబ్బకు అట్టే చావాలా అది."

"అంతేలెండి యిదోవిధమైన పాపఫలం. ఆ అమ్మాయి అనుభవించే యోగ్యతుంది. లేకపోతే ఆ అమ్మాయిచేతిలో చావాలా ఆ పిల్లి?" లోపల వచ్చే రాబడికి సంతోషం ఉబికివస్తున్నా, ఓదార్పుగా అన్నాడు రామశాస్త్రి.

"సరే తప్పుతుందా! చేసినంతా అనుభవించక, మంచిరోజు చూడండి. మీచేతిమీదుగనే కానిద్దురుగాని యిదిగూడా."

జిల్లాజడ్జిచేసి చనిపోయిన గోపాలంపంతులుగారి భార్య రంగనాయకమ్మ. సాలీనా ఏడెనిమిదివేలు అయివేజు వచ్చే ఆస్తిసంపాదించి, నిష్క్రమించడంచే ఆ ఐశ్వర్యాని కంతకూ ఒక్కకొడుకుతో అధికారిణి అయింది రంగనాయకమ్మోనాడు.

కొడుకు పట్నంలో చదువుకొంటున్నా, అపురూపపు కోడలవటంచే సుశీలను తనవద్దే పెట్టుకుంది. ఆ యింట్లో ఆమె, కోడలూ తప్ప మరెవ్వరూ లేరు.

యింటిని కనిపెట్టుకున్న రామశాస్త్రంటే, రంగనాయకమ్మ అపరిమితమైనభక్తిచూపిస్తుంది. రామశాస్త్రికి పాండిత్యంతో సమానంగా మాటల నేర్పరితనంకూడా ఉంది.

నాలుగురోజులనుంచి ఆ పిల్లి వచ్చి పాలకుండలోవి పాలుతాగేసి మిగతావి కంగారులో వంచేసి పారిపోవటం, మామూలైంది. ఎప్పుడూ కోపపడి ఎరుగదు కోడలుమీద రంగనాయకమ్మ. ఈ నాలుగు రోజులనుంచీ కొంచెం చిరాకుపడుతోంది. అభిమానంగల సుశీలకు యిది తగని బాధగా ఉంది.

నిన్న మరీగొడవైంది. మామూలుగా పాలు తాగేసి వెళ్లిపోక, కుండ వంచటంలో ఠపీమని బ్రద్దలుచేసి మరీ ఉడాయించింది కిటికీలోంచి మదురుగోడమీదకు. చప్పుడు వినివచ్చిన సుశీలకు మట్టిపాలైన పాలూ, బ్రద్దలై చెల్లాచెదరైన కుండ పెంకులూ కనుపించేయి. ఏమటంటూ అత్తగారు వచ్చేటప్పటికి ఏమీచేయలేక దిగాలుపడి మొగమింతచేసుకూర్చుంది. అత్తగారు ఓదార్చింది.

దొడ్లోకి వచ్చిన సుశీలకేసి చూస్తూ, మదురుగోడమీద కూర్చుని మూతిమీద పాలను నాలికతో నాక్కుంటూ "మ్యావ్"మంది. కళ్ళుఅరమోడ్పుగా మూసిన నల్లపిల్లి.

నీ "మ్యావ్" నే నణుస్తానులే అన్నట్లు కోపంతో చూచి, అప్పటికేమీ చేయలేక ఊరుకుంది సుశీల.

ఈవేళ అన్ని పనులూ మానేసి పొంచుంది పిల్లిని కొడదామని. సుశీల పొంచున్న సంగతి తెలియని పిల్లి యధాప్రకారంగా పాలకుండ ఎక్కి లోపల ముట్టి పెట్టి పాలుతాగుతోంది.

---

[illegible] *

కడుపులో కోపమంతా చేతిబలంలోకి రానిచ్చి, చేతిలోఉన్న అడుగుబద్దతో ఒక్కటి కొట్టింది సుశీల.

వెర్రిగాఅరచి పిల్లి కుండదగ్గరే పడింది కళ్ళు మూసేసి.

పిల్లి చచ్చిపోయిందన్నభయంతో, వెర్రికేకేసింది సుశీల. ఏమిటో అని అత్తగారు వచ్చిచూస్తే ఏముంది. పిల్లిని చంపినపాపం చుట్టుకుంది కోడలికనుకుంది. కోడలితో పోతుందనే నమ్మకం లేదు. కామారపు జాడిలా వంశానికంతకూ వచ్చిందనుకుందాపాపం, తక్కువ పాపమా అది? నల్లపిల్లిని చంపిన పాపమాయె. ఇంతలో పురోహితుడు రామశాస్త్రి అక్కడకు రావడం తటస్థించింది. అత్త అతనితో ఆలోచించింది.

రామశాస్త్రి పంచాంగం చూస్తున్నాడు సువర్ణదాన మివ్వటానికెప్పుడు బాగుంటుందో అని. సాధ్యమైనంత త్వరలో చూస్తే మరీ మంచిది. తలవనితలంపుగా నాలుగుతులాల బంగారం ఈ రోజుల్లో దొరకటమంటే మాటలా? తను ఎంతో అదృష్టం దాచి ఉంచబట్టే యిది. ఆ నల్లపిల్లి బంగారపు ముద్దయింది కళ్ళకు.

వచ్చే దశమీ బుధవారం....యింకా మాట పూర్తికాలేదు కూర్చున్న రంగనాయకమ్మ. రామశాస్త్రిలమధ్యనుంచి వీధిలోకి ఉడాయించిందా నల్లపిల్లి ఒక్కఅంగలో.

'అత్తా! పిల్లి చచ్చిపోలేదు. మీకేసే పారిపోయింది' అంటూ వంటింట్లోంచి వచ్చిన సుశీల అత్తగారితో చెప్పింది సంతోషంతో.

ఆ( నల్లపిల్లే!, ఆశ్చర్యపోతూ, కట్టిన పేకమేడలు కూలిపోతూంటే ఏమీ చేయలేక, ఎదురింటి అరుగుపై నుంచుని, దెబ్బతగిలినచోట నాలికతో నాక్కుంటూ, తనకేసిచూసి "మ్యావ్" మని అరచి కళ్ళు దోరగా పెట్టిన నల్లపిల్లికేసి చూస్తూ పాలిపోయిన మొహంపెట్టేడురామశాస్త్రి.

---

## విడాకులు

భార్య : తామలపాకులకు సున్నం రాసేదా? లేక విడాకులిచ్చేదా ?

భర్త : విడాకులే.

—మునుకుట్ల వెంకటేశ్వర్లు

---

## వ్యాసకర్తలకు:

★

- రచనాభ్యాసంగానికి మీరు కొత్తవారే కావచ్చు. వినా లోకానికి తెలపవలసిన కొన్ని కొత్త విషయాలు మీలో ఊరకలువేస్తూ వుండి వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించటానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనందవాణి ప్రాధాన్య మిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించే విజ్ఞానదాయకమగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రకటింప వీలవుతుంది.
- కొత్త సమస్యలకు సంబంధించి, ప్రసాదమైన హాస్యధోరణిలో ఉంటే తప్ప పద్య వ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ సూచించిన పోస్టు బిళ్లలు పంపితేనే ప్రకటించె పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయటానికీ వీలవుతుంది. కార్డులు జతపర్చవద్దు.
- ప్రతివ్యాసంపయినా వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన ఊహాలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక— 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబుశెట్టి వీథి, పోస్టుబాక్సు నం. 1588 మదరాసు-' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు